వెలుగు సముద్రంలో చీకటి దీవి

లోకం బాగుపడి పోయిందన్న మాటపట్ల నాకు నమ్మకం లేదు. కానీ లోకం బాగుపడుతోందని ఎవరైనా చెబుతే తటపటాయింపులు లేకుండా నమ్మేయాలనిపిస్తుంది. ఇది మెర మెచ్చులకోసం చెబుతున్న మాట గాదు. ఉద్యోగిలో లంచగొండి తనం. రైతులో స్వార్థం. వ్యాపారంలో బ్లాక్ మార్కెట్టు, విద్యార్థిలో క్రమశిక్షణా రాహిత్యం. ఈ అవినీతి లక్షణాలు సమాజంలో వున్న మాట నేను కాదనను. ప్రజాజీవనం ఒక మహాప్రవంతి; నువ్వెంతగానైనా ప్రయత్నించు. ఎంతో కొంత మురికీ ముట్టా, చెత్తా చెదారం అందులో కలిసివుండక తప్పదు. ఈ ఆసుపత్రులు. ఈ విద్యాలయాలు. ఈ ఎలక్ట్రిక్ స్తంభాలు, ఈ ప్రాజెక్టులు. ఈ సంతాన నియంత్రణా ప్రచారాలు యివన్నీ నాలాంటి ఆశావాది కేమని చెబుతాయి. దేశం బాగుపడుతుందనే చెబుతాయి.

కానీ ఈ నా అభిప్రాయాని కొకచోట దారుణంగా దెబ్బ తగిలింది. కాలగమనంలో గాయం మానిపోయినా మచ్చమాత్రం అలాగే వుండి పోయింది.

ఆ వూరిపేరు రంగాపురం. ఆంధ్రదేశంలో అధమపక్షం పది పన్నెండు రంగాపురాలైనా వుంటాయి. వాటిల్లో యిది ఏ రంగాపురమన్న ప్రశ్న యిక్కడ అప్రస్తుతం. కన్ను పొడుచుకోవడానికొక వేలు కావలిసి వచ్చినట్లుగా. కథ చెప్పుకోడానికి వూరంటూ ఒకటి వుండాలి గదా! అదిగో, అదే రంగాపురం!

ఆ వూరికి నేను వెళ్ళడం తమాషాగా గానీ, యాదృచ్ఛికంగాగానీ జరిగిన సంఘటనగాదు. పురిటింట ఆడబిడ్డ ఏడుపు వినిపించగానే ఫలానా వాడికి పెళ్ళాం పుట్టిందనుకునే సాంప్రదాయం సర్వజన విదితమే! కొందరు మగ బిడ్డల విషయంలో వాడేదో ఒక ఉద్యోగం చేసి బ్రతకడానికే పుట్టాడని

భావించడం లోకంలో పరిపాటి. ఆ విధంగా మా పెద్దలు నా నుదుట లిఖించి పెట్టిన ఉద్యోగం పేరు మాష్టారు గిరి; దానిపైన నేను మరులు గొనేందుకు వీలుగా మావా ళ్ళెన్నో దోహదక్రియలు సలుపుతూ వచ్చారు. "ఒరే అబ్బి. అది గౌరవప్రదమైన వృత్తిరా" అన్నారు. అందులో పాపానికి చోటే లేదన్నారు మా నాన్నగారు. మా తాతగారు కూడా బడి చెప్పుకునే బ్రతికారు గనుక అది నాకు కులవృత్తి గూడా నన్నారు. ఆయీ హితబోధవల్ల నేను మాష్టారు గిరిపైన మోజు పడ్డాననే చెప్పవలసి వుంటుంది. నా పాలిటికి ఉద్యోగ మన్న దొక సహధర్మిణి లాంటిదైతే, యిక పాణిగ్రహణ మొకటే తరువాయి.

వరుడికి వధువు నచ్చింది. కట్నాలు, కానుకల విషయంలో పేచీయే లేదు. పెళ్ళికొడుకు పెళ్ళికోపం తహతహ పడుతున్నాడు గూడా; ఐనా ఉభయ కుటుంబాల్లోనూ ఏవో యిబ్బందులు ఏర్పడటం వల్లనైతే నేమి. ఆ తరువాత మరి కొంతకాలం పంచాంగాల్లో శుభయోగాలు కలిసి రాకపోవడం వల్ల నైతేనేమి వివాహాలు వాయిదా పడుతుండడం గూడా తమకు విదితమే. ఉద్యోగప్రాప్తిలో నా కెదురైందిగూడా అదే. వలచిన ఉద్యోగం జీవనాటవిలో మాయామృగం చందమై రెండేళ్ళపాటు నన్ను కింకురించింది. అలసి సొలసి వెయ్యి నిట్టూర్పులు విడిచిన తర్వాత చివరికెలా గైతేనేం చేతికి దొరుకుతానని బాస చేసింది. గొంతెత్తి బిగ్గరగా అరిచాను—ఎక్కడున్నావు? ఎప్పుడు దొరకుతావని. ఇదిగో యిక్కడున్నా నని రంగాపురం నుంచే చేయి వూపింది.

ఉద్యోగ వార్తను తీసుకొచ్చిన ఆ ఉత్తరువు కాగితం నా కళ్ళకు వివాహ పత్రికకంటె అందంగా కనిపించింది.

రోడ్డులో బస్సు దిగాను. దిగినచోట ఎఱ్ఱమట్టి పరచిన మట్టిబాట ఒకటి ట్రంకురోడ్డు నుంచీ చీలి పొలాలగుండా ఎక్కడికో దూసుకుపోతోంది. ఆ కూడలిలో నాటివున్న సిమెంటు పలకపైన "రంగాపురం రెండు మైళ్లు" అన్న సూచన. నేను వెళ్లవలసినచోటికే వెళ్తున్నానని నమ్మకం పలికింది.

పొలాలు, ఓ చెరువుకట్ట. కట్ట దాటుకోగా కొన్ని ఫర్లాంగుల మేరకు చవిటిపర్ర. అక్కడ బాటక్రిందికి దిగగా ఓ కొండ ఏరు. ఒక పెద్ద మిట్ట. అక్కడనుండి దట్టంగా మామిడితోపులు, హఠాత్తుగా ప్రత్యక్షమైంది రంగాపురం.

రంగాపురం మరేమంత పెద్ద వూరుకాదు. ఉన్న నూరు నూటయాభై యిళ్లు పిచ్చివాడి చేతిలోని రాళ్లలా చెల్లాచెదరుగా విసరివేయబడి వున్నాయి. ఊరిలో యిండ్లు ఆక్రమించి వున్న జాగాకంటే ఖాళీగా వున్న స్థలమే ఎక్కువ. ఆ ఖాళీ ప్రదేశమంతటా పిచ్చి మొక్కలూ, తంగేడు చెట్లు, చీమల పుట్టలు ఏపుగా పెరుగుతున్నాయి. పచ్చికలో ఒక్క మనిషి మాత్రమే నడవడానికి వీలున్నంతటి కాలిబాటలు యింటింటికీ లంకెలుగా విస్తరించి వున్నాయి. ఎవడికి వాడు తన ఇంటినంతమట్టుకు నివాస యోగ్యంగా వుంచుకో తలచడమేగానీ, ఊరేమై పోయినా పట్టించుకోని నిర్లిప్తత మొదటి చూపులోనే నా కవగతమయింది.

పరిసరాలను కలయ పరికిస్తూ ఊరిమధ్యకు వెళ్లి అక్క డొక రచ్చ దాపున నిల్చున్నాను.

ఏమిటో అనుకున్నానుగానీ రంగాపుర మన్నది సార్థక నామధేయం. ఎందుకంటే పెద్ద పెద్ద పేట రొంపల్లో సైతం కనిపించనంతటి సుందరమైన దేవాలయం ఒకటి ఊరినడుమ గంభీరంగా వెలసివుంది. ఏమయినా ఊరి కుండవలసిన హంగుల్లో గుడికూడా ఒకటి. కానీ బడి ఎక్కడ?

ఎవరినైనా అడుగుదామనే అనుకున్నాను. ఎవరో కొందరు వుండీ వుడిగి వీధివెంట వెళ్తున్నారు గూడా! కానీ వాళ్ళ కెవరికీ రచ్చ ప్రక్కన క్రొత్త వ్యక్తి ఒకడు నిల్చున్నాడన్న ధ్యాసే వున్నట్టులేదు. ఎవరైతే మన కేమన్న ఉదాసీనతతో దూరదూరంగా వెళ్ళిపోతున్న వాళ్ళ వైఖరివల్ల నా అంతట నేనుగా వాళ్ళను పలకరించడానికి మనస్కరించడమూ లేదు.

అప్పటికింకా మధ్యాహ్నం కాలేదు. ఊరి నొక చుట్టు వేసుకొని వచ్చి అప్పటికీ బడి కనిపించకపోతే అప్పు డెవరి నయినా అడుగుదామన్న నిర్ణయానికి వచ్చాను.

రంగాపురంలో యిండ్లు ఒక క్రమపద్ధతిలో నిర్మించబడలేదని మనవి చేశాను గదూ! క్రమం లేకపోతేనేమిగానీ. అవి సమాజంలోని వైవిధ్యాన్నంతా తేటతెల్లంగా తెలివిడి చేస్తున్నామని ఒప్పుకోక తప్పదు. గారమిద్దెకు దాపున్నే మంటిమిద్దె దాని కెదురుగా పెంకుటిల్లు. దాని వెనుక పూరిపాక. అల్లంత దూరంలో ఒక గుడిస. ఇలా ఋష్యాశ్రమంలో పామూ కప్పా. పులీ. లేడీలాంటి ప్రాణుల్లా అక్కడ కలిమిలేములు సహజీవనం చేస్తున్నాయి. ఒక మూల చింతచెట్టు క్రింద గోలీకాయ లాడుకుంటూ కుర్రవాళ్ళు కొందరు కనిపించారు. కొందరు లాగులుమాత్రం వేసుకున్నారు. చొక్కాలు లేవు. కొందరు చొక్కాలు మాత్రం తొడుక్కున్నారు, లాగులు లేవు. తలలు, ఒడలు దుస్తులు మాసి మట్టిగొట్టుక పోయివున్న వాళ్ళ వైఖరిని బట్టి చూస్తే వాళ్లిటీవల ఎన్నడూ బడిముఖం చూచినట్టు లేదు. కాని ఆ వూరి బడిని గురించి వాళ్ళకు కొన్ని వివరాలు మాత్రం తెలిసివుండక పోవు. నాలో వాళ్ళకింకా మేష్టరుగారు కనిపించక మునుపే, బడిని గురించి వాళ్ళ అభిప్రాయాలను తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది.

దగ్గరికి వెళ్లి నిల్చున్నాను. ఓ క్రొత్త వ్యక్తి తమ క్రీడా రాజ్యంలో ప్రవేశించినందుకు వాళ్ళయినా ఏమంత సుముఖంగా వున్నట్టు లేరు. ఐనా నేను నా స్వప్రయోజనార్థం వాళ్ళ ఆనందానికి అడ్డు తగులక తప్పిందిగాదు.

"ఒరే అబ్బీ; ఈ వూరి బడి ఎక్కడ?" అని ప్రశ్నించాను.

బడిమాట బయటపడగానే వాళ్లొకరి ముఖం ఒకరు చూసుకున్నారు. రానున్న ప్రమాదాన్ని శంకిస్తున్న వాళ్ళలా దూరంగా వైదొలిగి ఒదిగి ఒదిగి నిల్చున్నారు.

"మిమ్మల్నే అడగడం! ఎక్కడుంది బడి?"

"అదిగో. అక్కడ" వాళ్ళొకవైపుకు దృష్టిని గుడించారు.

వాళ్ళ చూపులు ప్రసరించినచోట బొత్తిగా కట్టడం లాంటిది లేక పోలేదు. పూర్వాశ్రమంలో అది ఒక పూరియిల్లు. ఇప్పుడు దాన్ని పూరిల్లని చెప్పడం పెంటదిబ్బను పొదరిల్లని చెప్పడం. పైకప్పు ఏనాడో గాలి కెగిరి పోయింది. నాలుగైదు వెదుర్లు మాత్రం వెన్నుగాడునుంచీ వ్రేలాడుతున్నాయి.

ఒకవైపు గోడ కూలిపోవడంవల్ల దూలాలు భూమిపైకి వ్రాలి ముక్కోణమంటే ఏమిటో తెలియజేస్తున్నాయి.

"ఒరే అబ్బీ.. మీరు బడికి వెళ్ళడం మానుకుని ఎంత కాలమైంది?" అని అడిగాను.

"పొట్టి మీసాల మేష్టరుగారు వెళ్లిపోయిన తర్వాత మాకు బడిలేదు" పిపింద్రీలాంటి కుర్రవాడొకడు బదులు చెప్పాడు.

"పొట్టి మీసాల మేష్టారు ఎప్పుడు వెళ్ళిపోయాడు?"

"బలంగా వానలు కురిశాయి. బడి పెట్టుకోడానికి తావే లేకపోయింది పొట్టి మీసాల మేష్టరుగారు బస్సెక్కి వెళ్ళిపోయాడు."

"మళ్ళీ రాలేదన్నమాట!"

"రాననే చెప్పి వెళ్ళాడు!"

పరిస్థితిలో ఒక్కంత మాత్రమే తెలిసి వచ్చింది. కానీ వుత్సాహాన్ని శృంగదీయడానికి ఆ కొద్దిపాటి విషయమే చాలు! నిల్చునే ఓపిక లేక ఆ చెట్టు క్రింద కూలబడిపోయాను.

ఆ కుర్రవాళ్ళకి మాత్రం నన్ను గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి. ఎంతైనా వుంది. ఎవరతడు? ఎందుకోసం వచ్చాడు? ఆ వెళ్ళిపోయిన పొట్టి మీసాల మేష్టరుకు యితడేమైనా బంధువా?

వాళ్ళ ఆసక్తి వాళ్ళకుండగా, నా మట్టుకు నాకు గూడా వాళ్ళ ద్వారా మరికొన్ని వివరాలు తెలుసుకోవలసిన అవసరం వుండనే వుంది. ప్రొద్దు పుట్టక మునుపే బస్సెక్కాను. మార్గ మధ్యంలో బస్సు ఒకటి రెండుచోట్ల

నిలిచిన మాట నిజమే! కానీ అక్కడి హోటళ్ళలో ఏది పడితే అది తినేసే టంతగా నా ఉదరంలో జఠరాగ్ని ప్రకోపించలేదు. కేవలం కాఫీతో మాత్రం తృప్తిపడ్డాను. ఇప్పుడు కడుపులో కొక్కులు త్రవ్వుతున్నాయి.

"ఒరేయ్ అబ్బాయిలూ! ఈ వూరిలో హోటలుందా?" అన్నాను.

"ఒకేలా! అబ్బే లేదండి! మా వూళ్లో అంగడైనా లేదు."

హతాశుడినై పోయాను. ఏం చేయాలో తోచిందిగాదు. ఎందుకైనా మంచిదని మునసబుగారి నొకసారి కలుసుకోదలుచుకున్నాను. ఆ కుర్రవాళ్ళే మునసబు గారింటికి దారి చూపించారు. వెళ్ళిన సమయానికి మునసబుగారు మంగలిచేత తలంటించుకుంటున్నారు. శివుడి జటాజూటంనుంచి గంగాజలం ధారలు కట్టినట్టుగా, తైలధారలు చారికలుగా క్రిందికి దిగి అసలే మున్నగా వున్న ఆయన స్థూల శరీరానికి మరింత నిగనిగలు సమకూస్తున్నాయి. నూనె కాస్తా కళ్ళల్లో గూడా బడిందేమో, ఆయన కళ్లు మూసుకుని యోగనిద్రా ముద్రితుడైన పరమ యోగీశ్వరునిలా వున్నాడు.

"నమస్కారమండీ!" అన్నాను. తపస్సుకు భంగం కలుగజేసిన మూర్ఖుణ్ణి ఏ యోగీశ్వరుడు మాత్రం మన్నిస్తాడు? ఆయన నావైపు చురచుర చూశాడు.

నన్ను గురించి నేనే పరిచయ వాక్యాలు చెప్పుకున్నాను.

"ఓహో, మేష్టారుగారివా! ఇది మాకు పరిపాటే నాయనా! కూర్చో. ఏడాదికి నలుగురు మేష్టార్లయినా వస్తారు మావూరికి. రావడమూ, వెళ్ళిపోవడమూ! అంతేగానీ చదువు చెప్పినపాపాన మాత్రం పోరు. అసలిక్కడ చదువుకోవాలన్న ధ్యాస మాత్రం ఎవరికుంది? అదిగో, ఆ పెట్టెలోనే వున్నాయి స్కూలు రికార్డులు. ఆ పెట్టె గూడా స్కూలుదే. అదేగాదు. ఇంకా కుర్చీ ఒకటి, మేజా ఒకటి, ఒక నల్లబల్ల గూడా వున్నాయి అన్నింటినీ తీసుకెళ్ళు. లక్షణంగా చదువు చెప్పుకో...."

దక్షిణదేశంలో "నల్లతంగాళ్" అన్న పేరుతో సుప్రసిద్ధమైన జానపద కథ ఒకటుంది. నల్లతంగాళ్ పరమ సాధ్వి. వాళ్ళ దేశంలో కరు

వొచ్చి పడేసరికి ఆమెకు రారాని కష్టాలొస్తాయి. భర్త ఎటో వెళ్ళిపోతాడు. కొద్దికాలంపాటు తల దాచుకోడానికని ఆమె తన ఏడుగురు బిడ్డలతోసహా పుట్టింటికి వెళ్తుంది. అక్కడ అన్నగారుండరు. వదిన మూళిఅలంకారి, పరమ గయ్యాళి. ఆవిడ ఆడపడుచుకు సరఫరా చేసినవి ఓడుపోయిన కుండలు, దంచి వండుకోమని యిచ్చినవి జల్లు వడ్లు. వంటచెరకంటూ యిచ్చినవి అరటి పట్టలు. రంగాపురం మునసబుగారు నా పట్ల అంతకంటే తక్కువ ఆదరం చూపించలేదు.

కొన్ని సంవత్సరాల అనుభవంతోగానీ మనకు కొన్ని రహస్యాలు అవగతం కావు. కానీ రంగాపురానికి సంబంధించిన రహస్యాలన్నీ నాకు ఆ ఒక్కనాటి అనుభవంతోనే ఆకళింపుకు వచ్చేశాయి. ఆ తరువాత యించు మించుగా ఆరు మాసాలపాటు నేను రంగాపురంలో వున్నాను. ఆ ఆరు మాసాల పొడుగునా నా కెదురైన అనుభవాలు గూడా నా తొలినాటి అభి ప్రాయాలు మరింతగా బలపడడానికి మాత్రమే ఉపకరించాయి.

మునసబుగారు చెప్పినట్టు రంగాపురీకులకు ("నందవరీకుల"కు అను కరణ) తమ వూరిలో ఒక పాఠశాల వుండి తీరాలన్న పట్టింపేమీ లేదు. ఎందుకు లేదు? ఆ వూరిలో అంగాళ్ళుగానీ, హోటళ్లుగానీ మచ్చుకైనా లేవు. ఎందుకు లేవు? అనతికాలంలోనే ఈ యక్ష ప్రశ్నలకు సమ త్తరం తెలుసుకో గలిగాను. నూర్లకొలది గొర్రెలను మేపుకరావడానికి ఒక్కడే కాపరి చాలు. అలా కాకుండా ఒక్కటే గొర్రెకు నూరుమంది కాపర్లా? చదువురాని వాళ్ళం దరూ గొర్రెలకు మారు రూపాలుకాగా, చదువుకున్నవాళ్ళు గొర్రెల కాపర్ల వంటివారని రంగాపురీకుల నమ్మకం. ఎవడుబడితే వాడు చదువరిగా మారి పోయిననాడు గొర్రెలకంటే గొర్రెల కాపర్లే ఎక్కువైపోయే ప్రమాదం వుందని వాళ్ళ సిద్ధాంతం. తమ బిడ్డలు విద్యావంతులు కావాలని అభిలషించే కుటుంబాలు రంగాపురంలో చాల తక్కువ. చదువనేది నిస్సందేహంగా అమృతంలాంటిదని వాళ్ళకు తెలుసు. కానీ ఈ ప్రభుత్వం మోహినీ దేవతకు మల్లే ఆ అమృతాన్ని ఏరీ కోరీ కొందరికి మాత్రమే పంచిపెట్టగా అందరికీ సమానంగా వడ్డిస్తానంటుందే కర్మ! రంగాపురం వారి యీ యింగితాన్ని

ప్రభుత్వం పసిగట్టలేక పోయింది. అందుకు ఫలితంగా ఏడ్చినదే ఆ వూరి బడి. గుర్రాన్ని చెరువు దగ్గిరికైతే తీసుకెళ్ళవచ్చుగానీ, దానికి యిష్టం లేక పోతే నీళ్ళలా త్రాగించగలవు అన్న సామెత అవూరిపట్ల సార్థకమైంది. ఎర్రయ్య, పుల్లయ్య, జోగులు, వెంకటేశు అన్న పేర్లమధ్య వినయభూషణ్ విద్యాసాగర్‌ల వంటి పేర్లు చిక్కి బిక్కిరించడానికి సమ్మతించక ఘరానా కుటుంబీకులు తమ బిడ్డలను ఏ బంధువుల యింటికో, ఏ దూరప్రాంతాలకో పంపి చదివించుకుంటారు. ప్రభుత్వంవారు పెట్టిన బడికివస్తే గిస్తేఎల్లయ్యలు పుల్లయ్యలే వస్తారు. వాళ్ళయినా ఎలా వస్తారు? అయ్యవారిపట్ల బలవంతం పైన వస్తారు.

రంగాపురంలో అంగడిగానీ, హోటలుగానీ లేకపోవడానికి కారణ మేమిటంటే అది ఒక ప్రత్యేక ప్రపంచంగావడమే. బాహ్య ప్రపంచంలో చెల్లుబడి అవుతున్న న్యాయాలకు, ధర్మాలకు అక్కడ పరిగణన లేదు. మిగిలిన ప్రపంచంలోనైతే దర్జీవాడొక చొక్కాగుట్టి అందుకు ప్రతిఫలంగా ఒక రూపాయి పుచ్చుకుంటాడు. రంగాపురంలోనైతే వాడికి రూపాయిలో సగానికి సగమైనా గిట్టుబాటుకాదు. కాదుగీదని వాదుకు సిద్ధమయ్యాడో, వీపు సాపు చేయించుకుంటాడు. పోగా ఉప్పు, పప్పు, నిప్పు పెట్టెలాంటి వస్తువులతో ఆ వూరివాళ్ల కవసరం లేకపోలేదు. ఆ అవసరాలను గమనించి ఎవడో ఒక బేరగాడు గ్రామంలో ఒక చిల్లరకొట్టు పెట్టదలచుకుంటే అతగాడికి (నాకు మునసబుగారినుంచి లభించినట్టే) వుచితంగా అనుమతి లభిస్తుంది. కానైతే అందుకు వినిమయంగా అతడు తన సరుకుల నన్నింటినీ వుచితం గానే పంపిణి చేయవలసి వుంటుంది.

* * *

రామబాణంచేత ఖండింపబడి మళ్ళీ మొలిచిన రావణాసురుడి శిరస్సులా రంగాపురంలో మళ్ళీ బడి ప్రారంభమైంది.

బొత్తిగా సాధ్యం కాదనిపించినా, పనిని కొంతమేరకైనా సాధించడంలో మానవుడి కెంతైనా సంతృప్తి లభిస్తుంది. ఆత్మవిశ్వాసమన్న సౌధానికి ఆ సంతృప్తికంటే మించిన కాంక్రీటు పునాది వుండదు. పై పెచ్చు

అది నా మొదటి వుద్యోగం. పదికాలాలపాటు చేయవలసిన ఉద్యోగం కూడా. రంగాపురంలో కొద్ది నెలలపాటు బడి చెప్పగలిగానన్నమాట ఒకటి దక్కితే చాలు. ఆ మాట నా భావి ఉద్యోగ జీవితానికి బావుటాలా పనికి వస్తుంది. అందువల్లనే నేను పలాయనం చిత్తగించలేదు. పరిస్థితులను ఎదుర్కొన డానికే పూనుకున్నాను.

రంగాపురంలో బడి జరపడానికి చాలా ప్రతిబంధకా లున్నాయి. వాటిలో బడి ఉనికికి సంబంధించినది మొదటి సమస్య. ఆలోచించగా సూక్ష్మంలో మోక్షంలా ఒక ఉపాయం స్ఫురించింది.

రంగాపురంలో రంగనాథుడి కోవెల ఒకటి వుందన్నాను గదూ! దానికున్నవి బలమైన ప్రాకారకుడ్యాలు. ఒక మాదిరి ఎత్తైన గాలి గోపురం. దాని క్రింద వేసిన గుబ్బలతోసహా, వాటికి తగిలించిన గంటలతోసహా నల్ల బారిపోయిన సింహద్వారాలు నా ఆరునెలల అనుభవంలో అవి మచ్చుకొక నాడైనా తెరచిలేవు. ముప్పై మూడు కోట్ల దేవతల్లో ఏ ఒక్క దేవుడికీ లేని ఘోషాపద్ధతి నేనక్కడే మొదటిసారిగా చూచాను. పుంలింగమే గనుక గాకపోతే ఆ సూర్యం పశ్య అన్న కితాబు ఆయన కొక్కడికే తగును. నా యీ బడి నెపంతోనైనా రంగనాథుడి ఘోషాకు విచ్ఛిత్తి కలుగవచ్చునని ఆశించాను. బడిపిల్లల కోసమైనా గుడి తలుపులు తెరుచుకోవచ్చని ఉద్దేశించాను. సలహా కోసం మునసబుగారితో సంప్రదించాను.

మునసబుగారు ముసి ముసి నవ్వులు నవ్వుతూ వెళ్ళి నరసయ్యగారిని కలుసుకోమన్నారు.

“నరసయ్యగారంటే ఎవరండీ?” అన్నాను.

“రంగనాథస్వామి సంరక్షకుడు. గార్డియన్ అన్నమాట! నరసయ్య గారినే ఎరుగవా? భలేవాడివయ్యా పంతులూ! నీకు తెలియకపోతే గాలి గోపురంలోని పావురాల నడగరాదూ! నేలానట్రా. డబ్బా దస్కం అంటూ కొట్లాటలకు దిగి వ్యవహారాల కెగబడే కోర్టుపక్షుల నడగ రాదూ! పోనీ టౌనుకు వెళ్ళి సివిల్, క్రిమినల్ లాయర్లలో ఏ ఒక్కరినైనా పలకరించరాదూ?”

మామూలు విషయాన్ని గూడా పొడుపు కథలాగా చెప్పటం కొందరి కలవాటు. వెన్న చేతిలో వుండగా నేను నేతికోసం దేశమంతా తిరగదలచు కోలేదు. ఆ వూరిలోనే మరికొందరి దగ్గర నరసయ్యగారిని గురించి వాకబు చేశాను. జనవాక్యం ఏమంత ప్రోత్సాహకరంగా లేదు. అయినా నరసయ్యగారి నొకసారి కలుసుకోదలచుకున్నాను. రచ్చకు అత్యంత సమీపంలో వున్నదే నరసయ్యగారి యిల్లు. కొంత భాగం మిద్దె. మరికొంత పెంకుటిల్లు. ఇవిగాక ఒక పూరిపాక. వెనుక వైపున ఓపినంత ఖాళీ జాగా. రచ్చపైన నిల్చుండే నరసయ్యగారి గృహావరణలో ప్రతి భాగమూ స్పష్టంగా కనిపిస్తుంది. భూపతి కోసంవెళ్లగా, బృంగిరిటి ఎదురైనట్టు, నరసయ్యగారికోసం వెళ్లిన నాకు వాళ్ల పెద్దబ్బాయి. ఎదురయ్యాడు. అసలు పేరు కనకాచలం. వ్యవహారనామం పెద్దబ్బాయి. బొత్తిగా అబ్బాయి కాదు. ముప్ఫయి అయిదేళ్లుంటాయి. చెక్కి నిలబెట్టిన శిలా విగ్రహంలాంటి కాయవాటు శరీరం. అందుకు తగ్గట్టు లోతైన బావిలో కదలికలేని నీళ్లలా జడస్థితిలో వున్న ముఖకవళిక. కానీ విశేష మేమిటంటే నేను క్రొత్తగా వచ్చిన టీచరునని తెలియగానే పెద్దబ్బాయికి పరమానందం కలిగింది. "అయ్యా మేష్టారూ! ఈ వూరిలో వుద్యోగం కావడం మీ అదృష్టం" అన్నారు "ఎందుకండీ?" అన్నాను. "ఎందుకంటా రేమిటి? ఇక్కడ చదువు చెప్పినా, చెప్పకపోయినా అడిగే నాథుడు వుండడు" అన్నాడు. తన ధోరణి తనది తప్పితే ఎదుటివారి స్థితి గతులను గురించి పట్టించుకోని సుగుణాన్ని పరిపూర్ణంగా పెద్దబ్బాయిలోనే చూచాను. "బడికి కావలసిందేమిటండీ మేష్టారూ? పిల్లలేగదూ? మీ బడికి కావలసినంతమంది పిల్లల్లో సగం మంది మా ఇంట్లోనే వున్నారు" అంటూ అటూ యిటూ చూశాడు. "వాసూ, సీనూ, మణీ, నాగూ, బాబూ, బేబీ" అంటూ గొంతెత్తి పిలుస్తున్నట్టుగానే జంట జంటగా ఒక చిన్న పిల్లల జాబితా ఒప్పగించాడు. ఆ పేర్లతో చలామణి అవుతున్న భౌతిక ఆకారాలేవీ కనిపించకపోయేసరికి యింట్లో ఒక్కొక్క మూలకూ వెళ్లి ఒక్కొక్క శాల్తీని పట్టి తీసుకొచ్చాడు. "ఆ పొట్టిమీసాల బడిపంతులు వెళ్ళిపోయినప్పటినుంచి వీళ్లతో వేగలేక చచ్చిపోతున్నాము. మీ రొచ్చారు గనుక బ్రతికిపోయాము" అంటూ పిల్లల వైపు తిరిగి "ఒరేయ్ వాసూ! ఏం రోయ్ సీనూ!" అని

పేరు పేరునా అటెండెన్స్ పిలచినట్టుగా పిల్లలకు హెచ్చరిక గొలిపి "రేపు వుదయం తెల్లవారగానే బడిలోకి వెళ్లి కూర్చోవాలి మీరు! చద్దన్నాలయినా, కాఫీలైనా ఇంటికి గంట కొట్టినప్పుడే" అంటూ ముగించాడు.

"పెద్దబ్బాయి చేస్తున్న హంగామా నాకు కాస్త చిరాకు కలిగించిందనే చెప్పాలి. ఐనా చిరాకును బయల్పరచకుండా నేను నా యిబ్బందిని తెలివిడి చేసుకున్నాను—"బడి ఎక్కడ పెట్టుకోవాలో పాలుపోవడం లేదండీ! నాన్న గారు అనుమతిస్తే గుడిలో జరుపుకుందామనుకుంటున్నాను" అన్నాను.

"గుడిలో బడి పెట్టుకుంటారా?" నావైపు అనుమానంగా దొంగను చూచినట్టుగా చూచాడు పెద్దబ్బాయి—"అబ్బే, ఏమిటండీ.... మరి" అంటూ నీళ్లు నమిలి, అంతలో మనకెందుకులే అన్నట్టు మాట దప్పించి "ఏమం టారో మరి! నాన్నగారి నడిగి చూడండి" అన్నాడు. అంతలో వూరి మధ్య నుంచీ ఏదో అలజడి వినపించింది. అమ్మలక్కల జగడమై వుంటుంది బహుశా! "కూచోండి మేష్టారూ! నాన్నగారిప్పుడే వస్తారు" అంటూ తుర్రుమని ఆ వైపుకు జారుకున్నాడు పెద్దబ్బాయి.

పెద్దబ్బాయి వెళ్లిపోగానే చిన్న పిల్లలందరూ నన్ను చుట్టుముట్టేశారు. వాళ్లు పెద్దబ్బాయి కొక్కడికి తప్పితే ఈ ప్రపంచంలో మరే శక్తికీ భయపడే టట్టులేరు. "మా సీను ఎక్కాలే మరచిపోయాడండీ" అని ఒకరు. "వాసు గాడు సామాన్య శాస్త్రాన్ని చించి పడవలు చేశాడని" ఒకరు. "బేబీకి ఓన మాలే రావని" ఒకరు యిలా ఒక్కుమ్మడిగా నా చెవుల చుట్టూ కోటలు కట్టసాగారు. అదిరించి, బెదిరించి కిమ్మనకుండా కూర్చోబెట్టడానికి యిది బడి కాదు. నరసయ్యగారు వచ్చేదాకా నాకీ పిల్లల బెడద తప్పేటట్టూలేదు. "ఒరేయ్ పిల్లలూ! మేష్టారుగారిని వూపిరి తిప్పుకోనివ్వరు(టా! ఏమిటా గల్లంతు?" అంటూ తలుపు వెనుక నుంచి నన్నగా ఓ కంఠస్వరం కలుగ జేసుకొనేదాకా ఆ అల్లరి అలాగే కొనసాగింది.

"ఫరవాలేదండీ! పిల్లలుగాకపోతే అల్లరి మరెవరు చేస్తారు?" అన్నాను.

"పిల్లల మాటకేంగానీ మీరీ యాభై యేడో దేశంలోకి ఎందుకొచ్చి పడ్డారండీ మేష్టారూ! మరెక్కడా దొరకలేదా మీకు ఉద్యోగం?"

ఒక క్షణంపాటు నేను విస్మయచకితుడనై పోయాను. సరిగ్గా నా అంతర్వాణి పలుకుతున్న మాటలనే నేను వేరొక వ్యక్తిగుండా వింటున్నా నన్నమాట! రంగాపురంలో దైన్యం నిస్సహాయతా పూర్తిగా నాపాలేననుకున్నా నింతవరకూ! కాదు కాదు. అందులో పాలు పంచుకోడానికి యింకొక వ్యక్తి కూడా యిక్కడే వున్నట్టుంది ...

"అదేమండి. అలాగంటున్నారు? ఇక్కడ ఉద్యోగం గావడం నా అదృష్టమని యిందాకా పెద్దబ్బాయిగారే అన్నారే...."

నా యీ సందేహానికి లోపలనుంచి సమాధానం వస్తుందని కొంత సేపు వేచి చూచాను. ప్రత్యుత్తరం రాలేదుగానీ, కొన్ని నిముషాలు గడిచాక పరామర్శ మాత్రం వినిపించింది....

"కాస్త మజ్జిగ పుచ్చుకుంటారా మేష్టారుగారూ?"

నిజానికి నా కాకలిగానే వుంది. ప్రజ్వరిల్లుతున్న జఠరాగ్నిని చల్లార్చడానికి చల్లటి మజ్జిగ దొరుకుతుంటే వద్దని చెప్పడానికి నోరెలా ఆడుతుంది? ఐనా ఎవరు నేర్పిన పాఠం వాళ్ళకే ఒప్పగించడం యుక్తమనిపించి మౌనంగా వుండిపోయాను.

మజ్జిగ గ్లాసుతో ఆమె హాల్లోకి వచ్చింది.

దాహం తీర్చుకున్న తర్వాత "నర్సయ్యగా రెప్పుడొస్తారండీ?" అని అడిగాను.

ఆమె నవ్వింది. "మీ పిచ్చే మీదండి మేష్టరుగారూ! మీరు తల్లక్రిందులుగా తపస్సు చేసినా దేవళంలో బడి పెట్టుకోనిస్తారా మామగారు? బడి అన్న తర్వాత మాలా మడికీ అన్న తేడాలు చెల్లవుగదా! తిరుపతి వేంకటేశ్వరుడికైనా లేవుగానీ మా రంగనాధస్వామికింకా ఆ పట్టింపులు దండిగా వున్నాయి. మీరేదో భ్రమలో వున్నట్టున్నారు."

అంతర్యం అవగతమైంది నాకు. నరసయ్యగారితో మాట్లాడ్డంవల్ల లాభ ముండదని గూడా తేలిపోయింది.

"ఐతే వృధాగా మాటలు ధారపోసుకోవడ మెందుకు? వెళ్లొస్తానండీ!" అంటూ పైకి లేచాను.

"పాపం చాలా చిన్న వయస్సులోనే ఉద్యోగానికి వచ్చినట్టున్నా రండీ మేష్టరుగారూ! ఆ కాడికి మీరే నయం. నేను మీకంటే చిన్నప్పుడే ఈ వూరొచ్చేశాను. వచ్చి గూడా పదిహేనేళ్ళు దాటింది. ఎక్కడో తల్లి దండ్రులున్నారు. ఏదీ ఈ బాదరబందీనంతా వదిలించుకుని వాళ్ళ దగ్గరకు వెళ్ళడానికి నా కెక్కడ తీరుతుంది? ఇదే మనుషులు, ఇదే వూరు.... జైల్లో జీవిత శిక్షలావుంది బ్రతుకు...."

నరసయ్యగారింటి నుంచి బయటపడ్డాను. ఆ యింటి కోడలి మాటలు ఆ రాత్రంతా నా చెవిలో మార్మోగుతూ వుండిపోయాయి. ఆమె వయస్సు ముప్పైకి మించినట్టు తోచదు. అనవరతమైన చాకిరీవల్ల, సౌకుమార్యం లుప్తమైపోగా, ఆమె శరీరం చిక్కిపోవడమే గాదు, పాలిపోయింది. గూడా. మన కిష్టంలేని పని ఏదైతేవుందో, దాన్ని తప్పనిసరిగా చేయవలసి రావడ మన్నది మనసుకొక యాతన, శరీరానికి దండన. ఆ యాతన, ఆ దండన ఆమెకు పుష్కలంగా లభించినట్టున్నాయి. వాకబుచేయగా తెలిసింది. ఆమెకు తొమ్మండుగురు బిడ్డలు. తొలిచూలు ఆడబిడ్డకు పెళ్లీడు వచ్చింది గూడా!

* * * *

మరునాటి ఉదయం రంగాపురం రచ్చపైన బడికి ప్రారంభోత్సవం చేశాను.

చిన్నగది ఒకటి అద్దెకు దొరికింది. నాలుగుమైళ్ళ దూరాన ప్రతి ఆదివారమూ సంత జరుగుతుంది. ఇరుగు పొరుగు గ్రామాల్లో చిల్లరకొట్లు లేక పోలేదు. కావలసిన సరుకులు తెచ్చుకుని తీరికున్న మధ్యాహ్న వేళల్లో స్వయంగా పాకకార్యం నిర్వర్తించుకునే వాణ్ణి.

బరువుగా రోజులు దొర్లిపోసాగాయి.

ఆ తరువాత నేను రంగాపురాన్ని గురించి క్రొత్తగా తెలుసుకున్న దేమీలేదు. లేదంటే ఆ చీకటి దీవి నట్టనడుమ మరింత దట్టమైన చీకటి బంధువును మాత్రం కనిపెట్టగలిగాను. ఆ చీకటి బంధువే నరసయ్యగారి యిల్లు.

ఇది సంతాన నియంత్రణ పైన ప్రచారంకోసం వ్రాస్తున్న కథకాదు. ఐనా దాని ఆవశ్యకతను గురించి నొక్కి చెప్పడానికి యింతకంటే మంచి వస్తువు దొరకదు. అంతా దైవనిర్ణమనుకుంటూ, బాధ్యతలను గాలికి వదిలి పెట్టి ఎలా వీలైతే అలా కాలం గడపదలచుకున్న పురుషుడు. సంసారాన్ని సరిదిద్దడానికి సర్వశక్తులను ధారపోస్తున్న స్త్రీ. ఆ యిద్దరి నడుమ జరుగుతున్న సంఘర్షణకు నాట్యరంగమే నరశయ్యగారిల్లు. ఆ యింటి పెద్దలకు సుష్టుగా తిని త్రేన్చుతూ వెలుపలికి రావడమొక్కటే తెలుసు. పిల్లలకు ఏ మాత్రం మిగిలిందో, వాళ్ళు తింటున్నారో లేదో తెలియదు. పెద్దబ్బాయికి యిరవైయేళ్ళ వయసులోనే పెళ్లి జరిగింది. బిడ్డల్ని కనడానికీ, బండెడు చాకిరీ చేయడానికి శాశ్వతంగా ఒక మనిషి దొరికిందని అనుకున్నారేగానీ, ఆ మనిషికి మనసుందనీ, ఆ మనసుకు గూడా యిష్టాయిష్టా లుంటాయని పెద్దబ్బాయి కలలోనైనా భావించలేదు!

సంక్రాంతి సెలవులొచ్చాయి. ఇంటికి వెళ్లివద్దామనుకున్నాను "అమ్మ పిలుస్తోందండీ" అంటూ కబురుతెచ్చాడు వాసు.

వెళ్ళాను.

"ఊరికి వెళ్తున్నారటగా మేష్టరుగారూ!"

ఆమె తాను పొందలేని మధురానుభూతిని దేన్నో తలచుకుని తపించి పోతున్నట్టుంది.

"వెళ్తున్నానండీ! అయిదురోజులే సంక్రాంతి సెలవులు. మళ్ళీ సోమ వారంనాటికల్లా ఇక్కడుండాలి...."

"మిమ్మల్నయినా పండుగకు తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లనిస్తున్నారు. అంతే చాలు. క్షేమంగా వెళ్లిరండి...."

కళ్లల్లో గిర్రున తిరుగుతున్న కన్నీరు నాకు కనిపించగూడదనే ఆమె ప్రయత్నం. బయటి ప్రపంచంలోనికి వెళ్ళి రావడానికి అనుమతి పొందిన తోడిఖైదీని వేరొక ఖైదీ సాగనంపుతున్న దృశ్యంలా వుందది. నిజమే మరి. ఆమెకూ నాకూ వున్న సామ్యం ఒక్కటే - రంగాపురంలో ప్రవాసం. ఎటొచ్చీ ఆమెది సుదీర్ఘ ప్రవాసం. త్రెంచుకోడానికి వీల్లేనిది. అఱ్ఱు వాచిపోయినా ఆమె బండిని లాకెళ్ళవలసిందే! తప్పదు. ఆమెతో పోల్చి చూచుకుంటే నా పరిస్థితి ఎంతో మెరుగు. ఎప్పుడు బడితే అప్పుడు నేను నా ప్రవాసానికి స్వస్తి చెప్పుకోవచ్చు.

"నాకో సాయం చేసిపెడతారా మేష్టరుగారూ?"

ఏమి టన్నాను.

ఆమె లోపలికి వెళ్లి రెండు చీటీలు తీసుకొచ్చింది.

"చూస్తున్నారుగా మేష్టరుగారూ! మణి రెండు నెలలైంది సరిగ్గా అన్నం తిని. రాత్రుల్లో నిద్రపట్టదు, బలవంతంగా తినిపిస్తే, వుబ్బసంతో రెండు గంటలసేపు వూపిరి త్రిప్పుకోలేక పోతుంది. సీనుకు రోజు మార్చి రోజు జ్వరం వస్తోంది. అదేం మాయదారి జ్వరమోగానీ అది వచ్చినప్పటి నుంచీ వాడికి చెవులే వినిపించడం లేదు. బిడ్డలు చిక్కి సగమై పోయారు. వాళ్ళను చూస్తుంటే గుండెలు తరుక్కుపోతున్నాయి. మొన్న డాక్టరుగారి వ్యానువస్తే చూపించాను. డాక్టరుగారు ఈ మందులు వ్రాసి యిచ్చారు—"

"ఆ మందులు కొని తేవడమే కదండీ! అదెంత పని?"

"కాదండీ మేష్టరుగారూ! నా దగ్గర డబ్బులు లేవు...."

"ఫరవాలేదు. నా దగ్గరున్నాయి—"

"బిడ్డల్ని మన మేమయినా కావాలన్నామా మేష్టరుగారూ? దేవుడిస్తాడు. అలాగే జబ్బులుగూడా. అవి వస్తాయి, వెళ్తాయికూడా. లేదంటే తమతోబాటుగా బిడ్డల్నిగూడా తీసుకెళ్తాయి. మనకేం నష్టం? ఎందుకులెండి మేష్టరు

గారూ! కడుపుచించుకుంటే కాళ్ళపైన పడుతుంది. ఈ మందులు తీసుకొస్తే మీకు పుణ్యముంటుంది. మీ అప్పు ఎలాగైనా చెల్లించుకుంటాను.''

ఆవేదనవల్ల లోపల ఇమడలేక బయటికి పెల్లుబికిన ఆమె మాటల్లోని అంతరార్థాన్ని నేను గ్రహించగలిగాను. అందుపైన వ్యాఖ్యానానికి పూనుకోలేక మౌనంగా ఆ చీటీలు చేతికి తీసుకున్నాను.

ఊరునుంచి తిరిగివస్తూ మందులు కొని తీసుకొచ్చాను.

వారం రోజుల్లో బిడ్డల ఆరోగ్యం చక్కబడుతున్న సూచనలు కానవచ్చాయి.

ఓరోజు మధ్యాహ్నం వాసు కాస్త ఆలస్యంగా బడికి వచ్చాడు.

ఆలస్యానికి కారణం అడిగాను.

వాసుకి వాడి ఈడుకుమించిన తెలివితేట లున్నాయి. తీగతోబాటుగా డొంకంతా కదిలించేశాడు.

''పోస్టాఫీసు కెళ్ళానండీ! మా అమ్మ తాతయ్యకొక జాబు వ్రాసి పెట్టెలో వేసిరమ్మంది. మీరు మందులు కొనితెచ్చారటగదండీ మేష్టారు గారూ! మీకు డబ్బివ్వాలట. తాతయ్యను పంపమని రాసింది....''

పెద్దగా దానధర్మాలు చేసే తాహతు నాకు లేదని తెలుసు. కానీ వీలైనంతలో నేను కొన్ని దుబారా ఖర్చులు చేయనే చేస్తున్నాను. వాటితో పోల్చి చూస్తే మందులు కొనిపెట్టడం డబ్బును సద్వినియోగం చేయడం క్రిందికి వస్తుంది. అంతకంటే సత్కార్యానికి నేనెన్నడూ డబ్బును వినియోగించ లేదేమో! కానీ యీ వాదాన్ని ఆమె ఎలా అర్థం చేసుకో గలుగుతుంది?

మళ్ళీ కొన్ని రోజులు గడిచిపోయాయి.

ఒకనాటి మధ్యాహ్నం మరికొంతసేపటికి బడి వదిలిపెట్ట బోతున్నారనగా పోస్టుమేన్ కనిపించాడు. నాన్నగారి దగ్గరినుంచి నాకో వుత్తరం వచ్చింది. ట్రాన్స్ఫరుకోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశామనీ, కొద్ది రోజుల

వ్యవధిలో ఆర్డరు రావచ్చుననీ నాన్నగారు వ్రాశారు. ఆ సంబరం నా చేత పోస్ట్‌మేన్‌కు పావలా బక్షీసు గూడా యిప్పించింది.

"మా రాజులు చల్లగుండాలి" అన్నాడు పోస్టుమేన్. కార్డులూ, కవర్లూ గూడా అప్పుగా పుచ్చుకునే వాళ్ళేగానీ తనకో పైసా ధర్మంచేసిన వాళ్ళు లేరట! "వెళ్లొస్తానండీ! నరసయ్యగారింటికి వెళ్ళాలి. అమ్మగారికో మనియార్డరు వుంది" అంటూ వెళ్ళిపోయాడు. ట్రాన్స్‌ఫర్ రానున్న ఆనందం నన్ను నిశ్చలంగా వుండనిచ్చింది గాదు. బడికి సెలవు పెట్టాను. బస్సెక్కి రెండామడల దూరంలోవున్న ఒక బస్తీకి వెళ్ళాను. అక్కడ రెండు రోజులు గడిపి రంగాపురం తిరిగి వచ్చాను.

నరసయ్యగారింటి వాతావరణంలో ఏదో మార్పు వచ్చినట్టు తోచింది.

ఆ యింటి పిల్లల్లో సంచలనం తగ్గింది. ఆ మేరకు వాళ్ల ముఖాల్లో ఏదో దిక్కులు తోచనితనం కనిపిస్తోంది. మణి అన్నం తినలేదనో, వాసు స్నానం చేయకుండా వచ్చేశాడనో యింకా అలాంటి కారణాలపైన పెరటి గుమ్మందాకా వచ్చి ఒకటి రెండు మాటలు మాట్లాడి వెళ్తుండిన ఆ యింటి కోడలు పొలకువ పసిగట్టడానికైనా వీల్లేకుండా నా దృక్పథంనుంచీ వైదొలగిపోయింది. ఎటొచ్చీ క్రొత్త దుస్తుల్లో ముస్తాబై యింట్లోకి వూళ్లోకి చెడ దిరుగుతూ కనకాచలం ఒక్కడు మాత్రం ఉషారుగా కనిపిస్తున్నాడు.

ఈ మార్పుకు కారణమేమిటో తెలుసుకోడానికి రెండు రోజులుపట్టింది. మామగారి మనియార్డరు తాలూకు డబ్బులు పెట్టెలోవుండగా, కనకాచలం తీసి స్వంత డబ్బులాగా వాడుకున్నాడు. అందువల్ల ఉన్న వాటితోబాటు, భార్యాభర్తల మధ్య క్రొత్తగా యింకొక వైమనస్యం వచ్చిపడింది. కనకాచలం భార్యపైన చేయి జేసుకోబోయాడు. ఆవిడ ఒక పూట వంట చేయకుండా సత్యాగ్రహం సాధించింది.

ఈ సత్యాగ్రహంవల్ల తాను, తన బిడ్డలు తప్పా మరెవ్వరూ దుర పిల్లక పోగా, ఆమె రెండో పూటనుంచీ వంటచేయక తప్పలేదు.

ఆమెకు ఒక విషయం మాత్రం చెప్పాలని వుంది. నా కిప్పుడు డబ్బుతో వచ్చిన అవసరమేమీ లేదు. భావిలో ఎప్పుడు వీలైతే అప్పుడు అప్పు చెల్లింపబడవచ్చు. (ఆ మాటకొస్తే అది చెల్లింపబడక పోవడమే నా కిష్టం) ఈ మాట కాస్తా ఆమెతో చెప్పేయాలన్న నా ప్రయత్నం ఒక్క నాటిదిగాదు. ఏడెనిమిది రోజుల పొడుగునా అదే ప్రయత్నంలో వున్నాను. ఆమె కంటికే కనిపించకపోతే నేనేం చేయగలను? ఋణదాత మంచితనం పట్ల ఋణగ్రస్తుడి కేమంత నమ్మకం కుదరకపోతే-మనం ఆశ్చర్యపడ నక్కరలేదు. చివరికిదంతా రోకలి చేతబట్టుకుని గృహస్థుడు అతిథి వెంట పరుగెత్తిన కథలాగా పరిణమించింది. అతిథికి రోకలి యిచ్చేయ్యాలని గృహస్థుడి ఉద్దేశం. ఆ రోకలితో "బడితపూజ" జరుగుతుందేమోనని అతిథి అనుమానం.

పదో నాటికల్లా ట్రాన్స్‌ఫర్ ఆర్డరు చేతికొచ్చింది.

ఉద్యోగి కోరికపైన జరుగుతున్న బదిలీ గనుక జాయినింగు టైము గానీ, ట్రావెలింగు అలవెన్సుగానీ యివ్వబడలేదు. మరునాటి మధ్యాహ్నాని కల్లా నేను క్రొత్త చోట ఉద్యోగంలో చేరాలి. సాయంకాలం నాలుగు గంటల తర్వాత రంగాపురం రోడ్డులో బస్సులుండవు. ఆదరాబాదరా ఛార్జి లిష్టు తయారుచేసి బడి వస్తువులన్నీ మునసబుగారికి అప్పగించే సరికి గంట మూడు కావచ్చింది.

నరసయ్యగారింటికి వెళ్లాను.

ఏదో పెన్నిధిని పోగొట్టుకున్న వాళ్లకు మల్లే పిల్లలందరూ దిగాలుపడి ఎక్కడ వాళ్లక్కడ స్తబ్ధులై కూర్చుని వున్నారు. తల్లి తరువాత వాళ్లకు ఉపాధ్యాయుడినైనా, చెలికాడనైనా నే నొక్కడినే. ఊరిపట్ల కలిగిన వైముఖ్యంవల్ల ఏమేమిటో అనుకున్నానుగానీ ఒక కుర్రవాడి అమాయిక హృదయానికి ఆనందాన్ని అందివ్వగలిగినా చాలు. ఎలాంటి బాధలకైనా తట్టుకో వచ్చు. ట్రాన్స్ఫర్ రద్దయిపోయినా బాగుండుననిపించింది. కానీ అందు కోసమని విశ్వప్రయత్నం చేసి, తీరా అది సాధింపబడిన తరువాత విధిగా

బదిలీని అంగీకరించక తప్పదు. ఎవరెలా దురపిల్లినా నేను రంగాపురం వదలిపెట్టడం తప్పనిసరి.

"వాసూ! వెళ్లిపోతున్నాను బాబూ! అమ్మతో చెప్పిపోదామని వచ్చాను" అన్నాను.

"వెళ్లిపోతున్నారా మేష్టారూ! మీరైనా క్షేమంగా వుండాలి...." గాజుల గలగల గద్గదికమైన కంఠం. ముఖం మాత్రమే ఈవలికి కనిపించింది-"మీకు డబ్బివ్వాలి. వీల్లేకపోయింది. చిరునామా చెప్పి వెళ్లండి. సర్దుబాటుకాగానే పంపుతాను...."

నా కళ్లు గూడా చెమ్మగిల్లాయి.

లేచి నిల్చుని—"నమస్కారమండీ" అంటూ చేతులు జోడించాను. ఆమె దిగాలుపడి చూస్తుండగానే చరచరా వెలుపలకు వచ్చేశాను.

నా చిరునామా తెలుసుకోడంలో ఆమె ఉద్దేశం డబ్బును తిరిగి పంపడమే అయితే నా చిరునామా ఆమెకు తెలియకపోవడమే మంచిది.

వడివడిగా రంగాపురం నుంచి దూరంగా నడవసాగాను. ★